జూబ్లీహిల్స్‌లో శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల పరిశీలన

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 26నుంచి మార్చి 6వ తేదీ వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను టీటీడీ ఈవో జె.శ్యామలరావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం అంకురార్పణ, బుధవారం ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. మార్చి 2న గరుడ వాహనం, 5న రథోత్సవం, 6న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విస్తృత ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో చలువపందిళ్ల ఏర్పాటుచేసి అందంగా రంగవల్లులు తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లతో ప్రతిభావంతులకు ప్రోత్సాహం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రతిభ కొలమానంగా అడ్మిషన్ల ప్రక్రియ ఉంటుందని, అర్హులైన ప్రతిభావంతులకు స్కాలర్ షిప్ అందిస్తున్నామని నయంత లీడర్‌షిప్ సభ్యులు ఎయిట్‌రోడ్స్ సంస్థ మాజీ ఫౌండర్ రాజ్ దుగ్గర్ తెలిపారు. టీహబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నయంత ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ రంజన్ బెనర్జీ మాట్లాడుతూ ఏప్రిల్ వరకు దరఖాస్తుల స్వీకరిస్తామని, ఆగస్టు నుంచి పుణేలో ఉన్న తాత్కాలిక యూనివర్సిటీలో తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. వర్సిటీ అడ్మిషన్స్ డీన్ ప్రొఫెసర్ పార్థసారథి మాట్లాడుతూ ప్రతిభావంతులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఉంటుందన్నారు.



ఐఐటీహెచ్‌లో కంప్యూటేషనల్ కెమిస్ట్రీ కేంద్రాన్ని ప్రారంభించిన హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ-ఐఐటీహెచ్ అధ్యాపక బృందం

హైదరాబాద్‌ను ఫార్మా హబ్‌గా మారుస్తాం

- టీఐఎఫ్ఆర్ డైరెక్టర్ కృష్ణమూర్తి
- ఐఐటీహెచ్‌తో హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యం

కంది, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ఫార్మా హబ్ గా మార్చి, విద్యార్థులకు ఆధునాతన రసాయన విద్యను అందిస్తామని టీఐఎఫ్ఆర్ (టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంట్ అండ్ రీసెర్చ్) హైదరాబాద్ కేంద్ర డైరెక్టర్ కృష్ణమూర్తి అన్నారు. ఇండో-జర్మన్ సహకారంతో కంప్యూటేషనల్ కెమిస్ట్రీపై పరిశోధనలు జరిపేందుకు సోమవారం సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హైదరాబాద్‌తో జర్మనీలోని హైడెల్‌బర్గ్ యూనివర్సిటీ భాగస్వామ్యమైంది. రసాయన పరిశోధన, విద్యా మార్పిడి, ఉపాధి, ఆవిష్కరణలు, సాంకేతికత బదిలీ కోసం ఐఐటీహెచ్‌లో ఐదు రోజుల పాటు ప్రత్యేక వర్క్‌షాప్ హబ్‌ను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం హైడెల్‌బర్గ్ విశ్వవిద్యాలయ ఇద్దరు ఉపాధ్యక్షుల నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ప్రతినిధి బృందం ఈనెల 28 వరకు ఐఐటీహెచ్‌లో ఉంటూ ఇక్కడి విద్యా విధానాలు, పరిశోధనలపై అధ్యయనం చేయనున్నారు. ద్వైపాక్షిక- బహుపాక్షిక అకాడెమీ-ఇండస్ట్రీ భాగస్వామ్యాలను ప్రోత్సహించడం హబ్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఐఐటీహెచ్ అధికారులు వెల్లడించారు. ఆధునిక రసాయన శాస్త్రంలో విద్య, శిక్షణ, క్రాస్-కల్చరల్ లెర్నింగ్‌ను ప్రోత్సహించడం, మాస్టర్స్, గ్రాడ్యుయేట్ స్థాయిలలో దీర్ఘకాలిక ఇండో-జర్మన్ మార్పిడి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం ఒక ముఖ్య చొరవని ఐఐటీహెచ్ డీన్ నరహరిశాస్త్రీ తెలిపారు. రెండు విద్యా సంస్థల మధ్య స్థిరమైన శాస్త్రీయ, సాంకేతిక ఆర్థిక భాగస్వామ్యానికి మార్గం సుగమం చేస్తూ ఈ సహకారాన్ని నడిపించడంలో పరిశ్రమ, ప్రభుత్వ మద్దతు కీలకం ఆయన ఆకాంక్షించారు.

డిజిటల్ అరెస్టు కేసులో తమిళనాడుకు చెందిన ముగ్గురి అరెస్టు

- బాధితుడి నుంచి రూ.1.38 కోట్లు బదిలీ చేయించుకున్న ముఠా

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్టు పేరుతో డబ్బులు కొల్లగొట్టిన ఓ ముఠా సైబరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు చిక్కింది. ఈ కేసులో ఈ నెల 21న తమిళనాడులోని నమక్కల్‌కు చెందిన గోకుల్ మారుతచాల మూర్తి (24), జాఫర్ షరీఫ్ (23), షారుఖాన్ (30)లను అరెస్ట్ చేశారు. వారి నుంచి మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. సైబర్ క్రైం పోలీసుల వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన బాధితుడికి ముఠాలోని ఒకరు ఫోన్ చేసి తాను ఎస్‌బీఐ ప్రతినిధినని చెప్పి.. మీపై యాంటీ మనీలాండరింగ్ కేసు నమోదైందన్నాడు. అదే సమయంలో వాట్సాప్ కాల్ ద్వారా ఫోన్ చేసి ముంబై క్రైం పోలీస్ ఆఫీసర్‌గా మాట్లాడి ఆయనను తీవ్ర భయాందోళనలకు గురి చేశాడు. బాధితుడి ఆధార్ కార్డును మనీలాండరింగ్ కార్యకలాపాలకు వాడుకున్నట్లు తేలిందని బెదిరించారు. ఈ నేపథ్యంలో బాధితుడు వారికి రూ.1,38,60,000 వివిధ బ్యాంకుల నుంచి బదిలీ చేశాడు. ఆ తర్వాత మోసపోయానని గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేపట్టారు. బాధితుడు బదిలీ చేసిన నగదులో రూ.9.60లక్షలు గోకుల్ మారుతచాల మూర్తికి చెందిన ఫెడరల్ బ్యాంకు అకౌంట్‌కు వెళ్లినట్టు గుర్తించారు. ఈ డబ్బులను రాహుల్ అనే వ్యక్తి బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసుకున్నాడు. గోకుల్ తన బ్యాంకు అకౌంట్ వివరాలు, పాస్‌బుక్, ఏటీఎం కార్డు, చెక్‌బుక్‌లను జాఫర్ షరీఫ్, షారుఖాన్‌లకు కమీషన్ మీద ఇచ్చాడు. వీరంతా కలిసి ముఠాగా ఏర్పడి బాధితుడి నుంచి డబ్బులు బదిలీ చేయించుకొన్నారు. ముఠా సభ్యులు వాట్సాప్, టెలిగ్రామ్ యాప్‌లను వాడుతూ తాము పోలీసు అధికారులమని చెప్పి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు.

లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలుశిక్ష

రంగారెడ్డి జిల్లా కోర్టు, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రేమ పేరుతో వంచించి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి 20ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ రంగారెడ్డి 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి తీర్పునిచ్చారు. పీపీ మంజులాదేవి కథనం ప్రకారం.. కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పులిమామిడికి చెందిన తిమ్మగళ్ల శ్రీనాథ్(21) ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని ఓ బాలికను నమ్మించాడు. మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆ తర్వాత పెళ్లి చేసుకోకుండా తిరస్కరించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది. పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండుకు తరలించారు. కేసు పూర్వాపరాలను విచారించిన 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎమ్.వాణి నిందితుడు శ్రీనాథ్‌ను దోషిగా నిర్ధారిస్తూ 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేలు జరిమానా విధించారు. బాధితురాలికి రూ.3లక్షల నష్ట పరిహారం చెల్లించాల్సిందిగా తీర్పు వెల్లడించారు.

విద్యకు 15శాతం నిధులు కేటాయించాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య

రాంనగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని, సీఎం రేవంత్‌రెడ్డిని కోరుతానని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బహుజన ఫ్రంట్ ఆధ్వర్యంలో 'రాష్ట్ర బడ్జెట్‌లో విద్యకు 15శాతం నిధులు కేటాయించాలని' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్య పరిరక్షణకు ఉద్యమించాలని కోరారు. ప్రొఫెసర్ కె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, మనువాద భావజాలాల వల్ల విద్యకు బడ్జెట్ కేటాయింపులో అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ఎంవీ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి వెంకట్‌రెడ్డి, బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 15శాతం నిధులు కేటాయించాలన్నారు.

పెండింగ్ ఫీజులు, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి: పీడీఎస్‌యూ

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు పి. మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం మార్క్స్ భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ పీడీఎస్‌యూ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి బడ్జెట్‌లో 30శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

15రోజుల్లో 16వేల రేషన్ దరఖాస్తులు

- ఇందులో 10వేల దరఖాస్తులు కొత్త రేషన్‌కార్డుల కోసమే
- పేర్ల తొలగింపునకు మరో 6వేల దరఖాస్తులు

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబీకులకు కొత్తగా రేషన్ కార్డులను జారీ చేసేందుకు అర్హులైన నిరుపేద కుటుంబాల నుంచి దరఖాస్తుల స్వీకరణ ముమ్మరంగా సాగుతుంది. రేషన్‌కార్డు లేని అర్హులైన నిరుపేద కుటుంబాలు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. ఎన్నికల మెనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డుల జారీకి నిర్ణయం తీసుకుంది. ఈనెల 10వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణకు శ్రీకారం చుట్టింది. 10వ తేదీన ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైంది. కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు, కుటుంబీకుల ఆధార్ కార్డులు, చిరునామాను ధ్రువీకరించే కరెంట్‌బిల్లు గాని, గ్యాస్ బిల్లుతో మీసేవలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఈనెల 10వ తేదీ నుంచి మొదలైన కొత్త రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణలో సోమవారం నాటికి గడచిన 15 రోజుల్లో పౌరసరఫరాల విభాగం మలక్‌పేట సర్కిల్-1 పరిధిలో 16వేల దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా స్వీకరించారు.

కొత్త రేషన్ కార్డుల కోసమే అధికం

పౌరసరఫరాల విభాగం మలక్‌పేట ఒకటో సర్కిల్ పరిధిలో 15రోజులుగా స్వీకరించిన 16వేల రేషన్ కార్డులకు సంబంధించిన దరఖాస్తుల్లో 10వేల దరఖాస్తులు కొత్త రేషన్‌కార్డులకు సంబంధించినవేనని సర్కిల్-1 సహాయ సరఫరా అధికారి నర్సింగ్‌రాజ్ తెలిపారు. మిగతా 6వేల దరఖాస్తులు ఇంతవరకు ఉన్న రేషన్ కార్డుల్లోని పేర్ల తొలగింపునకు సంబంధించినవేనని ఆయన వివరించారు.

సర్కిల్ కార్యాలయానికి చేరిన దరఖాస్తులు 6వేలే

కొత్త రేషన్ కార్డుల కోసమే మలక్‌పేట సర్కిల్-1లో 10వేల దరఖాస్తులు రాగా ఇందులో సర్కిల్ కార్యాలయానికి చేరిన దరఖాస్తులు మాత్రం 6వేలేనని సహాయ సరఫరా అధికారి నర్సింగ్‌రాజ్ తెలిపారు. ఇంకా 4వేల దరఖాస్తులు సర్కిల్ కార్యాలయానికి చేరలేదన్నారు. అయినప్పటికీ దరఖాస్తుదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎందుకంటే కుటుంబీకులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లోనే నమోదు చేయించినందున వివరాలను ఆన్‌లైన్‌లోనే చూసుకునే అవకాశం కూడా ఉందన్నారు. దరఖాస్తుల వివరాలపై ఇంటింటికీ వెళ్లి పరిశీలనకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కాగానే డివిజన్ల వారీగా వాటిని విభజించే ఏర్పాట్లు చేస్తామన్నారు.

పేర్ల తొలగింపు రోజుకు మూడు వందలే..

ఇదివరకు రేషన్ కార్డులో పేర్లున్న కుటుంబీకుల్లో కొందరు తమ పేర్లను ఆయా కార్డుల నుంచి తొలగించి కొత్తగా కార్డు కోసమో లేక ఆదాయం పెరగడమో లేక వివాహానంతరం వేరుగా ఉండడం వల్లనో, చనిపోయిన వారి పేర్ల తొలగింపు కోసం వచ్చిన దరఖాస్తులు అక్షరాల 6వేలు. వీటిలోని పేర్ల తొలగింపు పనులకు మలక్‌పేట సర్కిల్-1 కార్యాలయ సిబ్బంది సహాయ సరఫరా అధికారి నర్సింగ్‌రాజ్ పర్యవేక్షణలో డిజిటల్ కీ ఆధారంగా చేస్తున్నారు. ఇందుకు గాను సర్కిల్-1 కార్యాలయంలో ఒక కంప్యూటర్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. పేర్ల తొలగింపు కోసం వచ్చిన దరఖాస్తుల్లో ప్రతి రోజు మూడు వందలకు మించడం లేదు. ఈ దరఖాస్తుల్లోని పేర్ల తొలగింపు పనులు జాగ్రత్తగా జరపడంతోపాటు పొరపాటున ఒకరి పేరు బదులుగా మరొకరి పేర్లు తొలగకుండా జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు.



ఆన్‌లైన్‌లో చేసిన దరఖాస్తు పత్రాలను పౌరసరఫరాల విభాగం మలక్‌పేట సర్కిల్-1 కార్యాలయంలో ఇచ్చేందుకు బారులు తీరిన జనం

నగరాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మధుయాష్కీ

వనస్థలిపురం, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నగర అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. సోమవారం వనస్థలిపురంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుయాష్కీగౌడ్ మాట్లాడారు. అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ నాయకులెవరు అడ్డుపడరు అన్నారు. ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆరోగ్యంపై దుష్ప్రచారం చేసే దుర్బుద్ధి మీ బీఆర్ఎస్ నాయకులకే ఉందని, తమ పార్టీ నాయకులకు అలాంటి చిన్న మనస్తత్వం ఉండదన్నారు. మీరు ఆరోగ్యంగా ఉండాలనే మేము కోరుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు. గతంలో జోనల్ కమిషనర్‌ను మీ అదుపులో పెట్టుకుని ఇప్పుడు అలా కుదరకపోవడంతో జోనల్ కమిషనర్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో జోనల్ కమిషనర్ ప్రతి డివిజన్‌లోని కాలనీల్లో స్వయంగా తిరుగుతూ సమస్యలను పరిశీలించిన తర్వాతనే అభివృద్ధికి పనులకు నిధులు మంజూరు చేస్తున్నారని తెలిపారు. గతంలో ఎన్నడైనా జోనల్ కమిషనర్, అధికారులను ప్రజల్లోకి తిరగనిచ్చారా అని ప్రశ్నించారు. అక్కసుతోనే జోనల్ కమిషనర్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు సుజాతానాయక్, కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నేలపాటి రామారావు, అశోక్‌గౌడ్, సత్యనారాయణ, నాయకులు భాస్కర్, రామకృష్ణారెడ్డి, ఉమేష్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

తనకు మంచి పేరొస్తుందనే అభివృద్ధి పనులకు అడ్డు

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): తనకు మంచిపేరు వస్తుందనే నెపంతోనే నియోజకవర్గంలోని అభివృద్ధి పనులను కాంగ్రెస్ నేతలు అడ్డుకుంటున్నారని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ పరిధిలోని కేబీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గంలో 15 కొత్త పార్కులు మంజూరు చేయించి నిర్మాణాలు సైతం పూర్తిచేసి 2023 ఎన్నికల కోడ్ కారణంగా ప్రారంభించలేదన్నారు. ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నియోజకవర్గంలో ఆ పార్టీకి చెందిన నాయకుల ఒత్తిడితో అధికారులు 15నెలలు గడిచినా ప్రారంభించలేకపోతున్నారని ఆరోపించారు. గ్రేటర్ హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గతంలో తమ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను సైతం కొనసాగించకపోవడమే కాకుండా తమకు పేరొస్తుందని అడ్డుకుంటున్నారని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ మన్సూరాబాద్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, నాయకులు టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, రుద్ర యాదగిరి, జగదీశ్‌గౌడ్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, కడమంచి ఆనంద్, సదానంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీలింగ్ భూనిర్వాసితుల ధర్నా

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనాజ్‌పూర్‌కు చెందిన సీలింగ్ భూనిర్వాసితులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వరకు సోమవారం పాదయాత్ర చేశారు. సీలింగ్ భూములకు పట్టా పాస్‌బుక్‌లతో పాటు 1బీలో చేర్చాలని కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్ తీసుకువచ్చిన తర్వాత సీలింగ్ భూమి రైతుల వివరాలను 1బీ నుంచి తొలగించారన్నారు. పాత పాస్‌బుక్‌ల స్థానంలో కొత్త పాసుపుస్తకాలను కూడా ఇవ్వలేదన్నారు. పదేళ్లుగా అధికారుల చుట్టూ తిరిగిన న్యాయం చేయలేదన్నారు. కావాలనే కొందరు రైతులకు పాస్‌బుక్‌లను రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే రైతులకు పట్టా పాస్‌బుక్‌లను ఇవ్వాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ, ముత్యాలు, శ్రీను, బాల్‌రాజ్, గుండె శివకుమార్, లింగస్వామి, మహేష్, రవి, భిక్షపతి, రాములు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీలింగ్ భూనిర్వాసితులు

యువతి అదృశ్యం

హయత్‌నగర్ : యువతి అదృశ్యమైన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దఅంబర్‌పేట్ సాయినగర్‌కాలనీలో నివాసం ఉండే పిన్నపురాల శ్రీజ(23) ఇంటర్ వరకు చదివి ఇంట్లో ఖాళీగా ఉంటుంది. పని నిమిత్తం తల్లిదండ్రులు బయటకు వెళ్లారు. ఇంట్లో ఎవరు లేని సమయం చూసి శ్రీజ సోమవారం ఉదయం బయటకు వెళ్లింది. తిరిగి ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద బంధువుల వద్ద విచారించినా ఫలితం లేక పోవడంతో సోమవారం సాయంత్రం శ్రీజ తల్లి లక్ష్మి హయత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మలక్‌పేటలో వ్యక్తి..

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌లో కూలీ పని కోసం ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఇంతవరకు తిరిగి రాలేదంటూ అతని కుటుంబీకులు మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన ప్రకారం మలక్‌పేట గాంధీనగర్ నివాసి వి.బాలాజీ(50) మలక్‌పేట మార్కెట్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. ఈనెల 21న మార్కెట్‌లో కూలీ పని కోసం వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. ఆచూకీ తెలియకపోవడంతో అతని కుటుంబీకులు మలక్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ నవీన్ మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్య

వనస్థలిపురం : అనారోగ్య సమస్యలతో యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. కర్నాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సయిద్ అయాన్(20) ఆటోనగర్‌లోని కేటీసీ పార్కింగ్‌యార్డ్ సమీపంలోని హిందు మోటార్స్‌లో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. కాగా అయాన్ కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం తన రూంలో ఎవరులేని సమయంలో రూఫ్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

తప్పుడు ప్రచారంపై చర్యలు తీసుకోవాలి

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలపై తప్పుడు ప్రచారం చేస్తున్న మజ్లీస్ బచావో తహరీక్ ఫ్యాన్స్ పేరిట సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్న నిర్వాహకులు సయ్యద్ నజీర్, మహ్మద్ సమీయుద్దీన్ సాబేర్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంబీఎం నాయకులు సైఫుద్దీన్ షఫీతో కూడిన బృందం చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేసింది. ఈమేరకు చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ఎం.మధును స్వయంగా కలిసి ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సైఫుద్దీన్ షఫీ మాట్లాడుతూ తప్పుడు ప్రచారంతో పాటు దూషించడం, మైనార్టీ వర్గాన్ని కించపరుస్తూ మత విద్వేషాలు రెచ్చగొట్టేలా ఇన్‌స్టాగ్రాం, ఫేస్‌బుక్, యూట్యూబ్ తదితర సోషల్ మీడియాలలో పోస్టులుపెడుతున్నారని ఆయన ఫిర్యాదులో వివరించారు. కొంతకాలంగా ఉద్దేశపూర్వకంగా సోషల్ మీడియాలో మలక్‌పేట ఎమ్మెల్యేను, మైనార్టీ వర్గానికి వ్యతిరేకంగా వారి మనోభావాలు దెబ్బతీసే విధంగా వీడియోలు వైరల్ చేశారని తెలిపారు. ఇందుకు కారకులైన వారందరిని పోలీసులు గుర్తించి విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

భారత దివ్యాంగుల క్రికెట్ జట్టు క్రీడాకారుడికి సన్మానం

సైదాబాద్ : భారత దివ్యాంగుల క్రికెట్ జట్టు క్రీడాకారుడు దనావత్ వస్త్రంనాయక్‌ను సోమవారం చంచల్‌గూడ జైలు కార్యాలయంలో సూపరింటెండెంట్ నవాబ్ శివకుమార్‌గౌడ్, ఇతర అధికారులు ఘనంగా సన్మానించారు. ఈనెల 13 నుంచి 20వరకు నేపాల్‌లో బోర్డ్ ఆఫ్ ఆఫ్గానిస్తాన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన టీ-ట్వంటీ, వన్‌డే సిరీస్‌లో నల్గొండ జిల్లా త్రిపురారం మండలం మాటూరుకు చెందిన వస్త్రంనాయక్ భారతదేశం తరపున ఆడి ఆల్‌రౌండర్‌గా నిలిచారు. సోమవారం జైలు సూపరింటెండెంట్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జైలు డిప్యూటీ సూపరింటెండెంట్ దేవుల నాయక్, జైలర్, దేవిసింగ్, మధు తదితరులు పాల్గొన్నారు.

మారుతీ మందిర్ ధర్మకర్తల ప్రమాణ స్వీకారం

చాదర్‌ఘాట్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని మారుతీ మందిర్ నూతన ధర్మకర్తలు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. దేవాలయ వ్యవస్థాపక చైర్మన్ కనుమూరి సీతారామరాజు, దేవాదాయ ధర్మాదాయశాఖ హైదరాబాద్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఈవో రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మండడి విజయసింహారెడ్డి సమక్షంలో ధర్మకర్తలుగా చిట్టంపల్లి కిరణ్‌కుమార్, గడ్డ నరేందర్, బి.సంధ్య, బొట్టు శ్రీనివాస్, శ్యాంరాజ్, గౌని చంద్రయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన అర్చకుడు ప్రహ్లాద్‌శర్మ ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకర్తలుగా దేవాలయానికి సేవచేసేందుకు అవకాశం కల్పించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, కాంగ్రెస్ మలక్‌పేట ఇన్‌చార్జి షేక్ అక్బర్, పార్టీ సీనియర్ నాయకుడు మండడి విజయసింహారెడ్డి, బద్దం సురేందర్‌రెడ్డి, కె.శ్యాంరావులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ప్రవీణ్, లక్ష్మణ్, ధర్మేందర్, గోపాల్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న మారుతీ మందిర్ నూతన ధర్మకర్తలు

'స్థానిక' ఎన్నికల్లో, నామినేటెడ్ పదవుల్లో యూత్ కాంగ్రెస్ నేతలకు అవకాశం కల్పిస్తాం

సరూర్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో, ప్రభుత్వం ప్రకటించే నామినేటెడ్ పదవుల్లో యూత్ కాంగ్రెస్ నేతలకు, కార్యకర్తలకు అవకాశం కల్పించడానికి కృషి చేయనున్నట్లు కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న యూత్ కాంగ్రెస్ ప్రతినిధులకు ఆయా విభాగాల్లో అవకాశం కల్పించాలని కోరుతూ సోమవారం యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ అధ్యక్షుడు వల్లపు సుభాన్‌యాదవ్ ఆధ్వర్యంలో కేఎల్లార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేఎల్లార్ మాట్లాడుతూ కాంగ్రెస్‌లో యువతకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని రాహుల్, రేవంత్ యోచిస్తున్నారని, త్వరలోనే దీనిపై సరైన నిర్ణయం తీసుకుంటారని అన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ కందుకూరు, మహేశ్వరం, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాల అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్, గొల్లూరి రాజు, పర్వతి రవికాంత్‌రెడ్డి, యూనస్, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్‌రెడ్డి, సామ వరుణ్‌రెడ్డి, మల్గారి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

చేతి పంపుల మరమ్మతులు, డ్రైనేజీ పనులు చేపట్టండి

మన్సూరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): చేతి పంపుల మరమ్మతులు, భూగర్భ డ్రైనేజీ పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి కోరారు. జలమండలి కార్యాయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో జీఎం శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలను వివరించి పరిష్కరించాలన్నారు.

తాగునీటి లో ప్రెషర్ సమస్య పరిశీలన

మన్సూరాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీలో నెలకొన్న తాగునీటి లో ప్రెషర్ సమస్యను జలమండలి జీఎం శ్రీనివాస్‌రెడ్డి కాలనీ అధ్యక్షుడు ఎర్ర వినోద్‌రెడ్డి, సభ్యులతో కలిసి సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ కార్యదర్శి జైపాల్‌రెడ్డి, సభ్యులు సుదర్శన్‌రెడ్డి, లైన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సిబ్బంది శివ పాల్గొన్నారు.

మార్కెట్‌లో అక్రమ నిర్మాణాలపై చర్య తీసుకోండి

సైదాబాద్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ యార్డులో విచ్చలవిడిగా చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం అందజేశారు. అనుమతులు లేని నిర్మాణాలపై సంబంధిత జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పేర్కొన్నారు.



డ్రోన్‌ల శిక్షణ కోసం వివిధ జిల్లాల నుంచి హాజరైన రైతులతో సైంటిస్టులు

వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగంపై క్రీడాలో ఐదు రోజుల శిక్షణ ప్రారంభం

హయత్‌నగర్, ఫిబ్రవరి 24(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థలో రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం, ఇఫ్కో ఆధ్వర్యంలో వ్యవసాయ రంగంలో డ్రోన్‌ల వినియోగంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రధాన శాస్త్రవేత్త ఐ శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయంలో డ్రోన్‌ను ఉపయోగించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. సాంకేతికత ద్వారా వ్యవసాయ యాంత్రీకరణ ఎలా చేసుకోవాలో వివరించారు. కూరగాయలు, పండ్ల తోటలు, పూల తోటలకు డ్రోన్‌లను ఉపయోగించవచ్చునని తెలిపారు. ఈ సందర్భంగా సీనియర్ శాస్త్రవేత్త చంద్రకాంత్, విజయ్‌కుమార్, శ్రీకృష్ణ, గోపాలకృష్ణారెడ్డి, సుధీర్ డ్రోన్‌ల వల్ల ఉపయోగాలు, పశువుల డాక్టర్లు డ్రోన్‌లను ఎలా ఉపయోగించాలో వివరించారు. ఐదు రోజుల పాటు ట్రైనింగ్ నిర్వహణ అధికారి విజయ్‌కుమార్ పర్యవేక్షణలో డ్రోన్ ఉపయోగాన్ని రైతులకు వివరిస్తారు. ఈ శిక్షణ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 30మంది శిక్షణ కోసం హాజరయ్యారు.

పోలీసుల డెకాయి ఆపరేషన్.. అంతర్జాతీయ వ్యభిచార ముఠా అరెస్టు

చాదర్‌ఘాట్ : చాదర్‌ఘాట్‌లోని మూసానగర్ బస్తీలో గుట్టు చప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తున్న అంతర్జాతీయ ముఠా ఆటకట్టించారు చాదర్‌ఘాట్, సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు. విశ్వసనీయ సమాచారం అందడంతో డెకాయి ఆపరేషన్ ద్వారా ముఠాపై దాడి చేశారు. మొత్తం 11మంది పట్టుబడ్డారు. ఇందులో ఒకరు మాత్రమే మూసానగర్ బస్తీకి చెందిన వ్యక్తి కాగా.. మిగతా 10మంది బర్మా, బంగ్లాదేశ్, వెస్ట్‌బెంగాళ్‌కు చెందిన వారున్నట్లు తెలిసింది. పోలీసులకు పట్టుబడిన 11మందిలో నలుగురు మహిళలు, ఏడుగురు పురుషులున్నారు. నలుగురు మహిళల్లో ఇద్దరు నిర్వాహకులు కాగా మరో ఇద్దరు బాధితులు. మిగిలిన ఏడుగురు నిర్వాహకులు. చాదర్‌ఘాట్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్ మూసానగర్ బస్తీలో వెస్ట్ బెంగాళ్‌కు చెందిన మహిళలు, వ్యక్తులతో కలిసి స్థానిక బస్తీ నివాసి ఇంటిని అద్దెకు తీసుకున్నారు. ఇద్దరు బాధిత మహిళలతో కలిసి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లుగా అందిన సమాచారం మేరకు స్పెషల్ టీమ్ పోలీసులు డెకాయి ఆపరేషన్ నిర్వహించగా వ్యభిచారం గుట్టు బయటపడింది. అనంతరం సౌత్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, స్పెషల్ టీమ్ పోలీసులతో కలిసి చాదర్‌ఘాట్ పోలీసులు సోమవారం సాయంత్రం వ్యభిచార గృహంపై దాడి చేసింది. వ్యభిచారం నిర్వహిస్తున్న 11మంది ముఠాను పట్టుకుంది. అనంతరం విచారణ జరపగా 10మంది బర్మా, బంగ్లాదేశ్, వెస్ట్ బెంగాళ్‌కు చెందిన వారిగా గుర్తించారు. ఇద్దరు బాధిత మహిళలు మినహా 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

కొత్తపేట : డివిజన్ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల వద్ద విజ్ఞాన శాస్త్ర అంశాలపై రంగవల్లులు వేసి ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు ఉమారాణి, శ్రీలత, రాణి, జ్యోతి, రమేష్ పాల్గొన్నారు.

LOST

I. Ch. Ramayasri W/o. Ch. Ravikumar, R/o 13-21-96, V.V. Nagar, Saroor Nagar, Rangareddy Dist. T.G. I Lost my Original Sale Deed Document No. 1432/2010 Dt. 12.03.2010. Registered at Dist Rigistrar Office, L.B.nagar, Plot No. 249, Survery No. 68, 79 &80. 310. Sq.Yds., 259.19. Sq. Mts. Situated at Nadergul Village, Saroor Nagar Rev. Mandal. R.R.Dist Nadergul Gramapanchyat. I lost by traveled from My Residence Syndicate Bank Colony to V.V. Nagar Bus stop unfortunately lost my Carry Bag as on date 01.02.2025.

If any one found Please Contact: 9247440625

ఆంధ్రజ్యోతి | ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి | రాజు : 99854 02786